క్లుప్తంగా

నేడు ఆరెలో గడప గడపకు మన ప్రభుత్వం

కేవీబీపురం: మండలంలోని ఆరె గ్రామంలో సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు ఆరె సచివాలయంలో అధికారుల సమావేశంలో పాల్గొని అనంతరం ఆరె పంచాయతీలో ఎమ్మెల్యే పర్యటించనున్నట్లు తెలిపింది. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ఫ్యాక్టరీ ప్రతినిధులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో ఆదర్శ్ సేవా సంస్థ, చతుర్య స్కిల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు టీఎస్ఎల్ కర్మాగారంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పాపానాయుడుపేట, ఏర్పేడు, చెన్నంపల్లి, వికృతమాల, పెన్నగడం, పెనుమల్లం, గుడిమల్లం, ఎండీపుత్తూరు, కందాడు తదితర గ్రామాల నుంచి వచ్చిన 56 మంది నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేశారు. వారి విద్యార్హత సర్టిఫికెట్లను పరిశీలించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను త్వరలో ప్రకటించనున్నట్లు ఆదర్శ్ సేవాసంస్థ వ్యవస్థాపకుడు ఐతేపల్లి గురునాథం తెలిపారు.

16 నుంచి ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) 7వ అఖిల భారత మహాసభలు నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.హరిక్రిష్ణ తెలిపారు. వారు ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జాతీయ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సభల్లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ నిర్మాణ కర్తవ్యాలను చేపట్టనున్నట్లు తెలిపారు. 16వ తేదీన ఉదయం 10 గంటలకు లక్ష్మీపురం సర్కిల్ నుంచి భారీ కార్మిక ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం పద్మావతి పార్క్ వద్ద బహిరంగ సభ చేపడతామన్నారు. 17, 18వ తేదీల్లో ఎస్ఎస్‌బీ కల్యాణ మండపంలో ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు.

ఘనంగా వర్షితప్ సరిత జైన్ సత్కార వేడుకలు



సరిత బొహర జైన్‌ను ఊరేగిస్తున్న జైనులు

తిరుపతి కల్చరల్: జైనుల సుఖసంతోషాలను కాంక్షిస్తూ ఏడాది ఉపవాస దీక్ష చేపట్టిన వర్షితప్ సరిత బొహర జైన్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. జైన్ మత వ్యవస్థాపకులు, జైనుల ఆరాధ్యులైన 24 మంది తీర్థంకుల్లో మొదటి వారైన రిషప్ భగవాన్ జైనుల పాప విమోచన కోసం చేపట్టిన వర్షితప్ పరంపరంగా సాగుతోంది. తిరుపతికి చెందిన జీతు జ్యువెలరి అధినేత జితేంద్ర అక్క సరిత బొహర జైన్ ఏడాది ఉపవాస దీక్షను పూర్తి చేసుకుంది. ఈమె తిరుపతి వాసి కావడంతో వారి కుటుంబ సభ్యులు ఆదివారం తిరుపతికి ఆహ్వానించి సత్కారం చేశారు. వర్షితప్ సరిత బొహర జైన్‌ను కొత్త వీధిలోని జైన్ మందిరం నుంచి మేళ తాళాల నడుమ ఊరేగించారు. అనంతరం జైన్ మందిరంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీతు జ్యువెలరి అధినేత జితేంద్ర, మహవీర్ జైన్, ప్రకాష్ జైన్, కుషల్ జైన్, జాస్‌చంద్‌జైన్, దేవేంద్రకుమార్, ప్రవీణ్, రాకేష్, రాజేందర్ బొహర, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, బెంగళూరు, తిరుపతి ప్రాంతాలకు చెందిన జైనులు పాల్గొన్నారు.

రచయిత్రి ధనాశి ఉషారాణికి వరల్డ్ బుక్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ధనాశి ఉషారాణి

భాకరాపేట : భాకరాపేట కు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు, రచయిత్రి ధనాశి ఉషారాణి శ్రీశ్రీ వేదిక జాతీయ అధ్యక్షుడు కత్తి మండ ప్రతాప్ నుంచి వరల్డ్ బుక్ అవార్డు అందుకున్నారు. ఆదివారం మహతి ఆడిటోరియంలో జరిగిన ప్రపంచ తెలుగు బ్రహ్మోత్సవాల్లో ఈ అవార్డు ప్రదానం చేశారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

- టీడీపీ నేతల మాయమాటలు నమ్మవద్దు
- మరోమారు జగనన్నను ఆశీర్వదించండి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



కృష్ణగిరికాలనీలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

ఏర్పేడు: అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంజిమేడు పంచాయతీ పరిధిలోని కృష్ణగిరి కాలనీ, పోతుమానిగుంట ఎస్టీ గ్రామాల్లో ఆదివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని 310 గడపలకు వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కృష్ణగిరి కాలనీ, పోతుమానిగుంట ఎస్టీ గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, మురుగునీటి కాల్వల నిర్మాణాలు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యేకి నివేదించారు. స్పందించిన ఆయన గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 4 ఏళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అవ్వాతాతలకు ఇంటికే పింఛన్ అందిస్తున్నామని, విద్యార్థులకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, అక్కచెల్లెమ్మలకు ఆసరాతో పాటు అనేక పథకాల ద్వారా ఆర్థికంగా చేయూత అందిస్తున్నామని వివరించారు. ఎవరికైనా అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

టీడీపీ నేతలవి మాయమాటలు..

టీడీపీ నాయకులు చెబుతున్న మాయమాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. 2014 ఎన్నికల్లో కూడా చంద్రబాబు నాయుడు అనేక అబద్ధపు హామీలిచ్చి అధికారం చేపట్టాక మోసం చేశారని ఆరోపించారు. మళ్లీ ఇప్పుడు టీడీపీ నేతలు మాయమాటలు చెబుతూ మీ మధ్యకు వస్తున్నారని, పొరపాటున కూడా వారి మాటలు నమ్మవద్దన్నారు. ప్రజలను కంటికి రెప్పలా చూసుకుంటున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇళ్ల వద్దే ప్రభుత్వ వైద్యసేవలు అందుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు చేపడుతూ సంక్షేమ పాలన కొనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, సర్పంచ్ తాతేకాల్వ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, వైస్ సర్పంచ్ తేజోవతి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, నాయకులు కన్నలి మోహన్‌రెడ్డి, లోకనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలగురునాథం రెడ్డి, పరమాల చంద్రశేఖర్, మహదేవ రెడ్డి, శంకర్‌రెడ్డి, గురునాథం, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

సిపాయి స్త్రీ స్వేచ్ఛకు శ్రీకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట: సిపాయి స్త్రీ స్వేచ్ఛ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అవుతుందని నెల్లూరు జిల్లా న్యాయమూర్తి సి.సత్యవాణి అన్నారు. రేణిగుంట మండలం సూరప్పకశం గ్రామంలో ఆదివారం సిపాయి స్త్రీ స్వేచ్ఛ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్సీ సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళల ఆరోగ్యం కోసం వినూత్నమైన పథకాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం చేపట్టడం సంతోషకరమన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ మహిళలలో శుభ్రతపై అవగాహన పెరగాలన్నారు. నెలసరి సమయంలో శుభ్రత నియమాలను పాటించకపోవడం వల్ల ఏటా లక్షలాది మంది మహిళలు గర్భాశయ క్యాన్సర్‌కు గురవతున్నారని తెలిపారు. దీంతో తాను నియోజకవర్గంలో ఏడాదికి సరిపడా మహిళలకు 30లక్షల శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే బాలింతలు, గర్భిణులకు ఎండు ద్రాక్ష, ఆరు కిలోల ఖర్జూరం, ఉసిరి, హార్లిక్స్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా పేద గ్రామీణ మహిళల ఆరోగ్య సంరక్షణ సాధ్యం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మహిళలకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుధ, లక్ష్మీపతిరెడ్డి, చంద్రారెడ్డి, వన్నెరెడ్డి సేవాసంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు, తిరుమలరెడ్డి, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, మునిశేఖర్, గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల ఊరేగింపు



పురవీధుల్లో దర్శనమిస్తున్న సీతారాములు



కోలాటాలు వేస్తున్న మహిళలు

ఏర్పేడు: మండలంలోని చిన్నఅంజిమేడులో ఆదివారం సీతారాముల ఊరేగింపు వైభవంగా జరిగింది. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా 10 రోజుల పాటు గ్రామస్తులు ఉభయదాతలుగా వ్యవహరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటానికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. విశేషాలంకరణ చేపట్టి కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాలతో సీతారాముల చిత్రపటాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సీతారాములను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నేతాజీ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇంటి పట్టాలు పంపిణీ



గిరిజనులకు ఇంటిపట్టాలను అందిస్తున్న పార్టీ నాయకులు

వరదయ్యపాళ్యం: మండలంలోని గూడాలవారిపాళ్యం పంచాయతీ పరిధిలోని చెంచురామశెట్టి కాలనీకి చెందిన గిరిజనులకు స్థానిక సర్పంచ్ చంద్రారెడ్డి చొరవతో ఇంటి స్థలాల పట్టాలను మంజూరు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇంటి స్థలాల్లేక అవస్థలు పడుతున్న గిరిజనుల సమస్యలపై చంద్రారెడ్డి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణం గిరిజనులకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని మండల రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. దీనికిపై స్పందించిన తహసీల్దార్ గౌరీశంకర్ రావు క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుల వివరాలను పరిశీలించి 13 మందికి ఇంటి స్థలాలను కేటాయించి పట్టాలను జారీ చేశారు. సంబంధిత పట్టాలను ఆదివారం మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా సర్పంచ్ చంద్రారెడ్డి పంపిణీ చేశారు. గిరిజనుల సమస్యలపై స్పందించి పట్టాలను మంజూరు చేయించిన స్థానిక ఎమ్మెల్యేకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని, అండగా నిలుస్తామని గిరిజనులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల జేసీఎం కన్వీనర్ చిన్న, మాజీ సర్పంచ్ తిలక్ బాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, జగదీష్ రెడ్డి, నానీ రెడ్డి, శివారెడ్డి, బాలసుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని క్రైస్తవ సోదరులు ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని 36 చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు చర్చికి వెళ్లి భక్తి శ్రద్ధలతో బైబిల్‌ను పఠనం చేసి, ప్రార్థనలు చేశారు. ఈస్టర్‌ను పురస్కరించుకుని చనిపోయిన వారి సమాధులపై పూలమాలలు వేసి, ప్రత్యేక ప్రార్థనలు చేసి, భక్తిగీతాలను ఆలపించారు. చర్చిల్లోని ప్రార్థనల్లో భారీసంఖ్యలో క్రిస్టియన్ సోదరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



పంటకు తగులుతున్న విద్యుత్‌వైర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని సాంబశివయ్య, సురేష్, నాగూరయ్య, మాధవి పొలాల వద్దనున్న విద్యుత్ వైర్ల వలన ప్రమాదం పొంచి ఉంది. పొలాల్లోని విద్యుత్‌వైర్లు కిందకు ఉండడంతో రైతులు పొలంలోకి వెళ్లటానికి భయపడుతున్నారు. దుక్కి దున్నలేక పోతున్నారు. వైర్లు కిందకు ఉండడం వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పంటలు కాలిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. పొలాల్లో కిందకు ఉన్న వైర్లను ఎత్తుకు లేపాలని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి పొలాల్లో కిందకు ఉన్న వైర్లను ఎత్తుకు లేపాలని కోరుతున్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ



వరినారు పెరుకుతున్న కూలీలు



వరినారు నాటుతున్న మహిళా కూలీలు



దుక్కిదున్నుతున్న రైతు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి, వేణుగోపాలపురం, కల్లివెట్టు, తలారివెట్టు, కనమనంబేడు, చిన్నపాలేడు, పెద్దపాలేడు, ఆర్ అనంతాపురం, జీఎస్‌కండ్రిగ, జంబుగోళం, గ్రామాల్లోని రైతులు వ్యవసాయ పనులలో బిజీబిజీగా ఉన్నారు. భూములను దుక్కి దున్ని వరినాట్లు నాటుతున్నారు. 11 గ్రామాల్లో సుమారు 1500 ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారు. కూలీలకు రోజుకు రూ.300 కూలీ గిట్టుబాటు అవుతుంది. వరినాట్లు ప్రారంభం కావడంతో మహిళ కూలీలకు డిమాండ్ ఏర్పడింది. గంగనీరు చెరువులకు వదలకపోతే వరి పంట ఎండిపోతుందని రైతులు అంటున్నారు. నెల రోజుల పాటు వ్యవసాయ పనులు ఉంటాయని, మెట్ట భూముల్లో బావులు, బోర్లు వద్ద వేరుశెనగ పంట వేయటానికి విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. మిగిలిన గ్రామాల్లోను త్వరలో వరి, వేరుశెనగ పంటలను వేయటానికి రైతన్నలు సిద్ధం అవుతున్నారు. గంగనీటి చెరువులకు అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

అందరి నోటా ‘జగనన్నే మా భవిష్యత్’



ప్రభుత్వ విధానాలపై అభిప్రాయం సేకరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు



ప్రజా సర్వేలో పార్టీ నాయకులు, కార్యకర్తలు



కేవీబీపురంలో ముమ్మరంగా సాగుతున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం

నారాయణవనం: ప్రభుత్వ పనితీరు పట్ల ప్రతి ఒక్కరి నోటా సంతృప్తి మాట వినిపిస్తోందని, ప్రభుత్వం నిష్పక్షపాతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పక్షాన నిలుస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ×జగనన్నే మా భవిషత్యు.. నువ్వే మా నమ్మకం జగన్¥ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని గోవిందప నాయుడు కండ్రిగలో జరిగిన ఇంటింటా సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మేలు జరిగే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధిదారులకు అందివ్వడంతో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాలనకు ముగ్ధులవుతున్నారని అన్నారు. ప్రతిపక్ష టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అవినీతికి పట్టం కట్టడంతో ప్రజలు చంద్రబాబుకు తగిన గుణపాఠాన్ని నేర్పారని చెప్పారు. ఇంటింటికీ తిరిగిన ఆయన ప్రభుత్వ పనితీరుపై రూపొందించిన ప్రశ్నలను చదివి వినిపించి ప్రజల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గృహ యజమానుల అనుమతితో ఇళ్లకు, సెల్‌ఫోన్లకు స్టిక్కర్లను స్వయంగా అతికించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులకు పలు సూచనలు ఆయన ఇచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన కార్యక్రమ ముఖ్య ఉద్దేశం నెరవేరే విధంగా నిబద్ధతతో సర్వేను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, వైస్ సర్పంచ్ మురళి, ఎంపీటీసీ సభ్యులు చెంగమ్మ, కైలాసకోన ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్

కేవీబీపురం: వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాలతో ‘జగనన్నే మా భవిష్యత్’ కార్యక్రమం మండలంలో జోరుగా సాగుతోంది. పార్టీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అన్నీ గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మునెమ్మ, ఎంపీపీ మునిలక్ష్మీతోపాటు నేతలు నందకుమార్, లాల్‌బాబు, సుబ్బన్న, మాధవి, ఎంపీటీసీలు మూర్తి సుబ్బన్న, అయప్ప, రాజేష్ సర్పంచ్ గిరి, హరిబాబు, బాల తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్

వరదయ్యపాళెం: జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మండలంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం చెంచురామశెట్టి కండ్రిగ, చిన్నపాండూరు గ్రామాల్లో జేసీఎస్ కన్వీనర్ చిన్న, మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదరరెడ్డి, సీనియర్ నాయకులు తిలక్‌బాబు, బాలసుబ్రమణ్యంరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి పర్యటించి స్థానికులతో మమేకమై కార్యక్రమాన్ని జరుపుతున్న తీరును పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంటా జగనన్న చేపడుతున్న సంక్షేమ పథకాలకు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే సంక్షేమం



శ్రీకాళహస్తిలో ‘జగనన్నే మా భవిష్యత్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పఠాన్ ఫరీద్



ఆమందూరులో ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ మైనారిటీ నాయకుడు పఠాన్ ఫరీద్ అన్నారు. పట్టణంలోని 35 వార్డుల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిరవధికంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం పఠాన్ ఫరీద్ ఆధ్వర్యంలో పట్టణంలోని 18వ వార్డులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. అలాగే ఇంటి తలుపులపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను వారి చేత అంటించారు. అనంతరం వారి ఫోన్ ద్వారా ప్రభుత్వం కేటాయించిన నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక ప్రజా సంక్షేమ పథకాలను అందించి ప్రజలను ఆదుకుంటున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు జగనన్న ముఖ్యమంత్రిగా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపలో ‘మా నమ్మకం నువ్వే జగన్’

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. ఆమందూరులో వైస్ ఎంపీపీ జమ్మల శ్రీనివాసులు, పాతవీరాపురంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఎండీపుత్తూరు రామయ్య ఆచారి ఆయా సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి స్టిక్లర్లు అంటించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు.

సలాం.. వందే భారత్



వందేభారత్ రైలు ప్రయాణం ప్రయాణికులకు కొత్త అనుభూతిని ఇస్తోంది. ఈ క్రమంలో ఆదివారం తిరుపతి నుంచి బయలుదేరిన వందే భారత్ రైలులో ఎక్కిన ప్రయాణికులు చేతులు ఎత్తి ఆనందం వ్యక్తం చేశారు. కొంతమంది విద్యార్థినులు తిరుపతి రైల్వే స్టేషన్‌లోకి వస్తున్న రైలు కనిపించేలా సెల్ఫీ తీసుకుని మురిసిపోయారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

